2-6-82



# బ్రహ్మసూత్రం

కె. సదాశివరావు

**జనవరి** 9, 2258 సాయంత్రం . . . ఏడు గంట లయింది

స్పేస్ సైంటిస్టులు, కాస్మోనాట్స్, ఇతర ప్రజలూ తమ కుటుంబాలతో వినోద విహారాల్లో రిలాక్సయే సమయంలో ఇంటర్నేషనల్ స్పేస్ క్లబ్ లాన్స్ మీద కూర్చుని తన గర్ల్ ఫ్రెండ్, వివాహం చేసుకుందామనుకుంటున్న ప్రియురాలునిశ్చలతో కులాసాగా కాలక్షేపం చేస్తున్న క్షితిజభూషణ్ రిస్ట్ వైసర్ (మణికట్టుకు. అమర్చిన పరికరం) ఇచ్చిన బ్లీంక్ వినగానే క్షణం ఉలిక్కిపడ్డాడు. ఇలాంటి సమయాల్లో ఏదో ఎమర్జెన్సీ లేకపోతే అతిథుల్ని డిస్టర్బ్ చేయడం అసాధారణం.

రిసీవర్ ఆన్ అయింది.

"ఎస్" అన్నాడు క్షితిజ్.

వైసర్ స్క్రీన్ మీద బ్రహ్మ ప్రత్యక్షం అయింది. గుడ్ లార్డ్! ఏదో అతి ముఖ్యమైన విషయం కాకపోతే బ్రహ్మ ఇలా ప్రవర్తించదు.

"మీ విహార సమయంలో ఇలా అంతరాయం కలిగించినందుకు క్షమాపణలు, క్షితిజ్! ఎలా ఉన్నారు మీరూ, నిశ్చలా?" అని క్షేమం అడిగింది.

"వెరీవెల్. థాంక్యూ, బ్రహ్మా!" అంది నిశ్చల.

"ఇంతకీ ఏమిటి విశేషం?" అడిగాడు క్షితిజ్.

"ఈ రోజు సాయంత్రం ఆరు గంటలకి ముఖ్యమైన సమాచారం లభించింది: క్షితిజ! మీరు వేరే ఎవరినైనా తోడు తీసుకుని మీరున్న ప్రదేశానికి మూడు వందల మైళ్ళ దూరంలో ఉన్న గ్రేట్ ఇంటర్నేషనల్ జంక్ యార్డ్ కి వెళ్ళాలి. మీరు ఎవర్ని సహాయం తీసుకెళతారో నిర్ణయం మీదే. ఈ సమాచారాన్ని మీకు అందజేయవలసిందని సెంటర్ చీఫ్ సైంటిస్టూ, చీఫ్ హిస్టోరియనూ— ఇద్దరూ నాకు ఆదేశం ఇచ్చారు" అంటూ ఏ మాత్రం ఉద్వేగం లేని కంఠంతో బ్రహ్మ తన సందేశం అప్పజెప్పింది.

"చూడు, బ్రహ్మా! టురాక్ బెల్మన్ ఎక్కడ ఉన్నాడో కొద్దిగా ట్రేస్ చేసి పెట్టగలవా? ఈ మెసేజ్ నేను చెబితే అతడు తన హాలిడే చెడగొడు

తున్నాడని మండి పడతాడు. ప్లీజ్!"

"ఓకే క్షితిజ్! టురాక్ మీతో మాట్లాడేటట్లు చేస్తాను. బై."

"బై, బ్రహ్మా!"

నిశ్చల పరిస్థితి అర్థం చేసుకుంది. ఇద్దరూ కలిసి కులాసాగా సాయంత్రం గడుపుదాం అనుకుంటే ఇలా జరిగేసరికి కొద్దిగా కలత చెందిన క్షితిజ్ చేతిని తన చేతుల్లోకి తీసుకుని ఆదరంగా, ఫరవాలేదు లే అన్నట్లుగా అనిర్వచనీయమైన ప్రేమతో అతడి కళ్ళలోకి చూసింది. పూర్ డియర్! ఈ స్పేస్ సెంటర్లోని సైంటిస్టుల ప్రయివేట్ జీవితాలు దాదాపు ఇలాగే ఉంటాయి. వ్యక్తిగత జీవితానికీ, బహిరంగ జీవితానికీ మధ్య ఉన్నది చాలా పలుచని తెర.

నాలుగు వారాల క్రితం ఇలాగే ఒకతేదీ అనుకుంటే హఠాత్తుగా నిశ్చల—వీనస్ (శుక్రగ్రహం) వెడుతున్న బృందంలో వెళ్ళవలసి వచ్చింది. ఇలాంటి ఇబ్బందులు అప్పుడప్పుడూ వచ్చినప్పటికీ అక్కడ వ్యక్తులలో సుఖ సంతోషాలకు లోటు లేదు.

"ఫరవాలేదు, క్షితిజ! బ్రహ్మ చెప్పినది చూస్తే అదేదో ముఖ్యమైన పని లానే ఉంది. టెల్ మన్ సిద్ధంగా ఉంటే నీవు వెళ్ళి తీరాలి. మనం వచ్చే బుధవారం కలుసుకుందాం. ఈ మధ్యకాలంలో నాకు లాబ్‌వర్క్ చాలా ఉంది. ప్రతి రోజూ అర్ధరాత్రి వరకూ పరిశోధన సాగించాలి. నేను దగ్గరే ఉండి ఆ రీడింగ్ తీసుకోవడం అవసరం. కంప్యూటర్‌కి వదిలేయవచ్చు కాని నా కలా చేయడం ఇష్టంలేదు."

నిశ్చల చేతిని తీసి ముద్దు పెట్టుకున్నాడు క్షితిజ. ఎంత బాగా అర్థం చేసుకున్నది తనను. ఈ ప్రపంచంలో తనకు ఎందరోహితులున్నారు. స్నేహితులున్నారు. ఇంతలా తను ఆదరించి ప్రేమించే ఒకే ఒక వ్యక్తి ఈమె. ఆమెను గురించిన ఒక్క ఆలోచనతో తన గుండెలో అమృతం పొంగి పోతుంది. ఆ శక్తి ఒక్క నిశ్చలకేఉంది. ఆమె సమక్షంలో ఈ ప్రపంచాన్నంత టినీమరిచిపోతాడు. ఏమిటి ఈఅసాధారణసంబంధం? ప్రకృతి ఇలాంటి అనిర్వచనీయమైన బంధాల్ని ఎందుకు సృష్టించింది? మానవజాతి స్థిరత్వం కోసమా? అది అవిచ్ఛిన్నంగాఅనూహ్యంగా విస్తరించి పరిణతి చెందడం కోసమేనా? ఏమో!

క్షితిజ వంగి నిశ్చల పెదవుల మీద ముద్దు పెట్టుకుంటుండగా రిస్ట్‌వైసర్ ఆన్ అయింది.


"సారీ ఫోక్స్" అంది టురాక్ గంభీర కంఠం.

"హల్లో టురాక్! నిన్ను చూసి చాలా కాలమైంది. ఎలా ఉన్నావ్?" అన్నది నిశ్చల నవ్వుతూ, కుర్చీలో వెనకకు వాలుతూ, సర్దుకుంటూ.

"చూస్తున్నావుగా నిశ్చలా! ప్రైవసీ లేదు. ఒక్క ముద్దూ ముచ్చటా లేదు. అస్తమానూ ఏదో పని. ఈ బ్రహ్మ మరీను. ఎక్కడ ఉన్నా ఏం చేస్తున్నా సరే తన పని తను చేసుకు పోవలసిందే! దాని దృష్టిలో అన్నీ క్రైసిస్‌లేక్లిష్ట సమస్యలే. హా ఇది మామూలుగా ఉండే గొడవే కాని మీ సంగతి చెప్పండి. పెళ్ళెప్పుడు?"

క్షితిజ నిశ్చలా ఇద్దరూ కళ్ళల్లోకి చూసుకుని నవ్వారు. క్షితిజే అన్నాడు:-

"తొందరేముంది, టురాక్? నా కాలయూన




ప్రాజెక్ట్ దగ్గర పడుతూంది. నిశ్చలదేమో తన పరిశోధన పూర్తి కావాలని పట్టుదలగా ఉంది."

"రియా ఏం చేస్తోంది, టురాక్?" కొంటెగా అడిగింది నిశ్చల.

"అడిగావూ? మంచి ప్రశ్న. అవిడకూడా తన ఎక్సోబయాలజీ రిసెర్చ్ చేస్తూ బిజీగాఉంది, నిశ్చలా! ఇంతకీ పెళ్ళి సంగతి చెప్పనేలేదు" అంది.

"నా బయోగ్రావిటీ రిసెర్చ్ పూర్తవాలి టురాక్" అంది నిశ్చల. ఆమె కంఠంలో పట్టుదల గోచరించింది.

"మీరేమన్నా చెప్పండి. వెంటనే పెళ్ళి చేసుకుంటే మంచిది. నీ బయోగ్రావిటీ, క్షితిజ కాలయూన ప్రాజెక్ట్ ఎక్కడికీ పోవు. మీరు ఆలస్యం చేస్తే కాలం అన్ని ఆలోచనలను తలకిందులు చేసేస్తుంది. లక్ కిడ్స్! అదృష్టవశాత్తో, దురదృష్టవశాత్తో మనం ఈ యుగంలో పుట్టాం. చుట్టూ కంప్యూటర్స్, రోబోట్స్! వీటితో వేగలేక మనం కూడా మెకానికల్‌గా తయారవుతున్నాం" అని దీర్ఘంగా నిట్టూర్చాడు టురాక్.

క్షితిజ మందహాసం చేశాడు అతడిధోరణి చూసి. అంతా తమాషా! జోక్. ఆ పైన అదొక రకమైన ఆవేదన... అది టురాక్ ప్రత్యేకత.

జీవితాన్ని నూటికి నూరు పాళ్ళూ అందంగా అనుభవించే సామర్థ్యం ఉన్న వ్యక్తి టురాక్. అతనిలో నీగ్రో, ఇంగ్లీష్, అరబ్ రక్తాలు సమపాళ్ళలో ఉన్నాయి. అతడి తాత ఇంగ్లీష్ మన్—ఆయన ఆఫ్రికన్ మహిళని పెళ్ళాడాడు. తల్లి అరబ్. మూడు జాతి రక్తాల త్రివేణి సంగమం టురాక్ టెల్‌మన్.

కాని ఇలాంటి జాతి సాంకర్యం ఇప్పుడు అరుదు కాదు. ఆరోగ్యకరంగా, మంచి ఎత్తుతో, తల్లినుండి సంక్రమించిన నల్లటి కళ్ళతో గోధుమ రంగు చాయతో కంప్యూటరుతో పోటీ చేయగలిగిన తెలివి తేటలతో ఇవేవీ కాకుండా జీవితం మీద విస్పష్టమైన భావాలతో, హాయిగా కాలం గడిపే మనిషి అతను. ఇంటర్నేషనల్ కమ్యూనిటీలో అందరూ గౌరవించే సైంటిస్టు.

ప్రాజెక్టు పనిలో మంచి జట్టుగా పనిచేయ వలసిన అవసరం వస్తే క్షితిజ్, టురాక్ కలిసి పనిచేసేవారు. ఇద్దరిలోనూ కష్టపడే స్వభావం, నిగూఢమైన జ్ఞానం, నిశితమైన మేధస్సు ఉన్నాయి. ఇద్దరికే ఉన్న పట్టుదల—వారిద్దరి టీమ్ విజయవంతం చేసింది.

"క్షితిజ్! నీవు సిద్ధంగా ఉంటే నేనూ సిద్ధమే" అన్నాడు టురాక్.

ఒకేసారి క్లిక్‌మని వైసర్ స్క్రీన్ మీద ఇద్దరికీ ఏక కాలంలో దర్శన మిచ్చింది బ్రహ్మ.

"టురాక్, క్షితిజ్! మీ ప్రైవసీలో ప్రవేశించి మీ సాయంకాలాన్ని చెడగొట్టినందుకు మిమ్మల్ని మళ్ళీ క్షమించమని అర్థిస్తున్నాను."

"ఓకే. ఫర్వాలేదు కాని, మెసేజ్ ఏమిటో చెప్పు, బ్రహ్మా!" అన్నాడు టురాక్ కొద్దిగా అసహనంతో.

"ఈ వేళ ఆరు గంటలకి ఇంటర్నేషనల్ జంక్ యార్డ్‌నుండి ఒక ఎలక్ట్రానిక్ సిగ్నల్ భూమి మీద అన్ని దిశలకూ ప్రసరించింది. అది ఎక్కడనుంచి వస్తున్నదో (సోర్స్)—ఆ సిగ్నల్ చారిత్రకంగా చాలా ప్రాముఖ్యత ఉందని చారిత్రకుల అభిప్రాయం. ఈ సిగ్నల్ ఏదో పురాతన ఎలక్ట్రానిక్ పరికరంనుండి ఉద్భవించిందని కొన్ని కంప్యూటర్లు చెప్పాయి.

మీరు చేయవలసింది ఏమిటంటే జాగ్రత్తగా ఆ మూలాన్ని (సోర్స్) కనుక్కుని సెంటర్‌కి తీసుకురావాలి. ఆపరికరం ఏదో చాలా సున్నితమైనదై ఉంటుంది. ఏ మాత్రం డామేజ్ జరగకుండా మీరు దానిని సేకరించి తీసుకు రావాలి. మళ్ళీ రిపీట్ చేస్తున్నాను. అది ఏ విధంగానూ డామేజ్ కాకుండా చూడటం చాలా ముఖ్యం! మీకు సహాయం చేయడానికి సైక్లాప్స్ మోడల్ మినిస్కానర్ (మరో వైజ్ఞానిక పరికరం) ని వెంట తీసుకెళ్ళవచ్చు. అది మీకు ఉపయోగకరంగా ఉంటుంది ఇంకా ఏమైనా సందేహా లున్నాయా?"

"ఒకటే సందేహం, బ్రహ్మా! నీవు ఎప్పుడు

విశ్రాంతి తీసుకుంటావు?" అన్నాడు టురాక్ చిలిపిగా.

సోలార్ సిస్టమ్‌లోని అతి శక్తివంతమైన కంప్యూటర్ బ్రహ్మ. దానిని కంప్యూటర్ అనడం ఒక విధంగా తప్పు. అది ఒక జెయింట్ బ్రెయిన్!! అది చేయలేని పని లేదు. దానికి తెలియని రహస్యం భూమిమీదే కాదు—సూర్యమండలంలో మానవ స్థావరాలు వెలసిన ఏ గ్రహాల్లోనూ లేదు. అది సర్వాంతర్యామిలా ఉండి మానవ సమస్యలను తీరుస్తూ, ఎంతో ఉపయోగకరమైన బాధ్యతను నిర్వహిస్తుంది. అందుకే కొందరు దానిని 'బ్రహ్మ 1984' అని పిలుస్తారు. ఏ క్షణంలోనైనా అది కొన్ని కోట్లమంది మానవులతో, ఇతర కంప్యూటర్స్‌తో, కమ్యూనికేషన్ ఉపగ్రహాలతో, రోబాట్స్ ( మర మనుషులు )తో మాట్లాడుతూ వేరువేరు పనులను చక్కబెడుతూ, అలా వచ్చే అనంత సమాచారాన్ని ప్రతిక్షణం ఎనలైజు చేస్తూ ఇరవై మూడో శతాబ్దపు మానవుడి కృషిలో భాగం పంచుకుంటూ, అతడి అభ్యున్నతికి దోహదం చేస్తున్నది.

ఎంతో అణకువగా ఉండేలా అది డిజైన్ చేయబడినప్పటికీ మానవులలో సహజంగా ఉండే తెలివి తక్కువని సహించి కాస్త హాస్య ప్రియత్వం ప్రదర్శించే అవకాశం దానికి కల్పించారు.

టురాక్ ఒకసారి జోక్‌చేస్తూ బ్రహ్మని అడిగాడు—

"ఇంత జ్ఞానం నీలో పొందుపరచి ఉంది. నా ప్రశ్నలకి సమాధానం చెప్పగలవా, బ్రహ్మ?"

"తప్పకుండా ప్రయత్నిస్తాను. నేనున్నది అందుకేగా?"

"గుడ్డు ముందా? పిల్లముందా?"

"ఆ ప్రశ్నకు సమాధానం మనకింకా అందుబాటులో లేదు. అంతుచిక్కని ఈ ప్రశ్నకి సమాధానం దొరికితే సృష్టి రహస్యం తెలుస్తుంది."

"అరె! చెప్పలేకపోయావన్న మాట! సరే నా రెండో ప్రశ్నకి సమాధానం చెప్పు—మరణం తర్వాత మళ్ళీ జన్మ ఉంటుందా, బ్రహ్మ?"

"ఉంటుంది!"

"దానిని ఋజువు చెయ్యి చూద్దాం."

"నాకు మరణం లేదు కాబట్టి నేను స్వయంగా ఆ పరిస్థితిని అనుభవించలేను. కాని, మానవుడిగా నీ స్వభావ సిద్ధమైన మరణానంతరం నా సమాధానంలోని నిజాన్ని నీవు తెలుసుకుంటావు."

"కాదు, బ్రహ్మ! నాకు తక్షణం ఋజువు కావాలి."

"అయితే నీవు తక్షణం చావాలి. అప్పుడు నీకు తెలుస్తుంది నీ ప్రశ్నకు సమాధానం. ఇలా చెపుతున్నందుకు క్షమించండి! మీ ప్రశ్నకు సమాధానాలు మీ జన్మ మరణ రహస్యాలను మానవ మేధస్సు ఛేదించినప్పుడే తెలుస్తుంది. హేతువాదానికి అందే విషయాలు కావివి. ఈ చర్చతో మీ సమయం వృథా అయిపోతున్నదేమో!"

"సారీ, బ్రహ్మ, శ్రమ ఇచ్చాను. విశ్రాంతి తీసుకో!"

"పరవాలేదు" అంది బ్రహ్మ అనునయంగా.

"పుక్కిటి పురాణాల్లో బ్రహ్మకి ఎలా విశ్రాంతి లేదో—నాకూ అలాగే విశ్రాంతి లేదు! ఆ సంగతి మీ అందరికీ తెలుసుగా!" అని చెప్పి బ్రహ్మ అవాక్కయి పోయింది.

నిజమే. బ్రహ్మకి విశ్రాంతి అవసరం లేదు. మనిషి తనంతట స్నానంచేసి, ఆహారం తీసుకొని, ఆరోగ్యాన్ని జాగ్రత్తగా చూసుకొన్నట్లే బ్రహ్మ తనను తాను శుభ్రం చేసుకుంటుంది. ఏ యంత్రాలను ఎప్పుడు పనిచేయించాలో అప్పుడే పనిచేస్తుంది.

టురాక్ తలపోసుకుంటూ కూర్చుంటే బ్రహ్మ మళ్ళీ సంకేతాలను పంపించి, రిస్ట్ వెయిసర్ మీద ప్రత్యక్షమైంది.

"మీకు అప్పగించిన పనిని వెంటనే చేయవలసి ఉంది. మీ రింకా కదలలేదు. మీ మెసేజ్‌కోసం ఎదురుచూస్తుంటాను. చాలా ముఖ్యమైన పని అది మరచిపోకండి. చాలా జాగ్రత్తగా ఉండాలి సుమా. అయినా మిమ్మల్ని నేను అనుక్షణం కనిపెట్టి ఉంటాను. మీ ఇద్దరికీ గుడ్‌బై!" వీడ్కోలు చెప్పింది బ్రహ్మ.

"గుడ్‌బై" అన్నారు క్షితిజ, టురాక్.

హవర్ క్రాఫ్ట్‌లో టురాక్, క్షితిజ కలిపి జంక్ యార్డ్ వైపు ప్రయాణం చేస్తున్నారు. దాంతో పాటు సైక్లోప్స్ స్కానర్‌కూడా ఉంది. క్రాఫ్ట్



చూడండి...
సర్వోత్తమ
తెలుపుకోసం
రానిపాల్®


బట్టలను ఆఖరుసారి జాడించునపుడు కొంచెము రానిపాల్ వేయండి. అపుడు చూడండి...బట్టలపై మెరిసే తెలుపు! రానిపాల్ తెలుపు! తెల్లటి బట్టలు ఏవైనా కాని—నూలు, సింథెటిక్ మరియు మిశ్రమ బట్టలు రానిపాల్‌తో మెరుస్తూ వుంటాయి.

నియమానుసారంగా
రానిపాల్‌ను వేయండి...
తెలుపు చూడండి. చూపండి!




నూలు దుస్తులకు
రానిపాల్®
సింథెటిక్ మరియు మిశ్రమ దుస్తులకు
రానిపాల్® ఎస్

Shilpi SG-2A/78 Tel




గంటకు ఆరు వందల మైళ్ళ వేగంతో ప్రయాణం చేస్తున్నది. క్రాఫ్ట్ లోపల ఆ వేగం ప్రభావం ఏ మాత్రం కనపడటం లేదు. ఎత్తు పల్లాల మీద నుండి, నీటి మీద నుండి ఆటోమాటిక్‌గా పునః సృష్టి కాబడుతున్న శక్తి ఆధారంతో ప్రయాణం జరుగుతూంది. దానికి రోడ్లు అవసరం లేదు. రోడ్లు, పట్టాలు అవసరం ఉన్న ప్రయాణ సాధనాలను ఇరవై ఒకటో శతాబ్దంలోనే తొలగించారు. ఇప్పటి ప్రయాణ సాధనాలలో కాలుష్యం ఏ మాత్రం లేదు. ధ్వనికూడా లేదు!

మానవులు తక్కువ సంఖ్యలో భూమి మీద ప్రయాణం చేయడానికి తయారు చేసిన వాహనాల్లో అతి చవక అయినవీ, అత్యంత సుఖంగా ఉండేవీ హావర్ క్రాఫ్ట్ వాహనాలు. ఇంకా ఎక్కువ దూర ప్రదేశాలకూ, ఎక్కువ మంది మనుషులతో బాగా సామానుతో ఇతర గ్రహాలకి పోవడానికి గ్రావి రాకెట్లు వాడుతున్నారు.

సుమారు అరగంటలో టురాక్, క్షితిజ్ జంక్ యార్డ్ చేరుకున్నారు.

అతి ఎత్తయిన గోడలతో, నాలుగ్గైదు వందల అడుగుల ఎత్తున ఉన్న రస్ట్‌ప్రూఫ్ షీట్స్ కప్పిన రూఫ్‌తో ఉన్న మహామంధిరము. శక్తివంతమైన లైట్లు వెలుగుతూ లోపలంతా కాంతిని నింపేస్తున్నాయి. అందులో గత శతాబ్దాల సాంకేతిక నిపుణులు సృష్టించిన తరవరాల గాడ్జెట్స్ ఉన్నాయి. చారిత్రకంగా ముఖ్యమైనవీ, సాంకేతిక ప్రగతిలో అతి ముఖ్యమైన సాధనాలు అనదగిన మోడల్స్‌ను అన్ని దేశాల పురావస్తుశాలలోనూ భద్రపరిచారు. మిగిలిన వాటి నన్నింటినీ ఇక్కడ పడేశారు.

ప్రస్తుత శతాబ్దంలో అన్ని వస్తువులూ రిన్యూయబుల్ ( పునఃసృష్టి ) అవకాశం ఉండే విధంగా తయారుచేశారు. రీసైకిలింగ్ చాలా సామాన్యమైన ప్రక్రియగా తయారై కాగితం కోసం అడవుల్ని కొట్టవలసిన అగత్యం ( కాగితం అవసరంకూడా పూర్తిగా లేకుండా పోయింది. గుటెన్‌బర్గ్ యుగాన్నించి మెక్‌లూహన్ యుగంకూడా దాటి ఇంకా ముందు కొచ్చేశారు మానవులు ). ఖనిజాల కోసం భూమిని అడ్డదిడ్డంగా త్రవ్వే భూగర్భంలో మనుషుల్ని ప్రమాద వశాత్తూ పాతివేసే మైనింగ్ పద్ధతులకు స్వస్తి చెప్పారు.

మళ్ళీ అడవులు దట్టంగా పెరిగాయి. పంథొమ్మిది, ఇరవై శతాబ్దాల్లో జరిగిన మారణ హోమాల్లో మనుషులే కాకుండా శాశ్వతంగా నాశనమై పోగా మిగిలిన పశువుల, పక్షుల వృక్ష జాతులకి రక్షణ లభించింది. అడవుల్లో మళ్ళీ జంతువులూ పక్షులూ వృద్ధి చెందడం ప్రారంభించాయి. జెనెటిక్స్ శాస్త్ర సహాయంతో కుటుంబ నియంత్రణ పాటించబడుతూంది. తన మనుగడ ఇతర జీవుల, చెట్ల మనుగడతో ముడి పెట్టుకుని ఉన్నదని మనుషులు గ్రహించారు.

హావర్ క్రాఫ్ట్ ఇచ్చిన మేసేజి రిసీవ్ చేసుకుని మెయిన్ గేటు తెరుచుకుంది. హావర్ నిశ్శబ్దంగా వాలింది. కొద్దిగా దుమ్ము లేచింది.

క్షితిజ్, టురాక్ క్రాఫ్ట్ బయటకు వచ్చి చుట్టూ చూశారు. మైళ్ళ తరబడి ఉన్న జంక్‌యార్డ్‌లో మానవ నిర్మితమైన అన్ని రకాల పరికరాలూ అస్తవ్యస్తంగా పడి ఉన్నాయి. రైళ్ళు, కార్లు ట్రాక్టర్లు, కుట్టు మెషీన్లు, రెఫ్రిజిరేటర్లు, రేడియోలు, టెలివిజన్లు, విమానాలు, స్టీరియో సిస్టంలు, రాకెట్లు...ఇంకా ఏవేవో కుప్పలు తెప్పలుగా పడి ఉన్నాయి. ఇద్దరూ వాటి వంక విస్మయంతో చూశారు.

వారి మనస్సుల్లోని ఆలోచనని పసి కట్టినట్టుగా సైక్లోప్స్ అంది.

"ఎంత వెనకబడిన పరికరాలు!"

"ఎందుకని?" అన్నాడు టురాక్.

"తమని తాము బాగు చేసుకునే సామర్థ్యం లేకపోవడం వల్ల వీటి కీ గతి పట్టింది" అంది సైక్లోప్స్.

"నిజమే" అని ఒప్పుకున్నాడు క్షితిజ్. అతడికి నవ్వొచ్చింది. ఒక మెషీన్ ఇతర మెషీన్స్ మీద వ్యాఖ్యానిస్తూంది.

తమ తాత ముత్తాతలూ వారి సమకాలికులూ ఇలాంటి ప్రిమిటివ్ వస్తువులని ఉపయోగించి తమ జీవితాల్ని సుఖమయం చేసుకునే వారన్నమాట. విపరీతమైన కాలుష్యాన్ని సృష్టించే బొగ్గు రైళ్ళు,

2—6—82

కార్లు ఇంధనశక్తిలో చిన్న శాతాన్ని మాత్రమే ఉపయోగించే చాతుర్యం ఉన్న ఇంజన్లు, చిన్న తెర మీద రెండు డైమెన్షన్లలో కదిలే బొమ్మల్ని చూపించే టెలివిజన్లు, అదో రకం రాక్షస పక్షుల్లా శబ్దం చేస్తూ ఎగిరే విమానాలు. అలాటి విమానాలకు ఏదైనా ప్రమాదం వాటిల్లితే ఒక్కరు కూడా మిగలరు!

ఒక తరం ప్రగతి మరో తరాని కల్లా ఆశ్చర్యకరంగా పాతపడిపోవడం ఎంత విచిత్రం! ఒక కాలంలో అల్ట్రా మోడర్న్—తరవాత కొద్ది దశాబ్దాల్లోనే అదే వోల్డ్ ఫాషన్! ఆ పైన పురాతనం! ముంచుకొస్తున్న భవిష్యత్తు తనకు అడ్డు వచ్చిన తరంలోని మనుషుల్నీ వస్తువుల్నీ కాస్మిక్ జంక్‌యార్డ్‌లో పడేస్తుంది. ఇది తిరుగులేని సత్యం!

"ముందుకు పోదాం" అన్నాడు క్షితిజ్ ఆలోచన నుంచి తేరుకుని.

"పద" మన్నాడు టురాక్.

సైక్లోప్స్ బయటకు దిగింది. దాని తల అటు ఇటూ కదలడానికి వీలుంది. చూడటానికి ఒకే ఒక కన్ను లాంటి లెన్స్ ఉంది. అందుకే దాని పేరు సైక్లోప్స్ ( ఏకాక్షి ). ఎలక్ట్రానిక్ పరికరాల లొకేషన్ దగ్గర నుండి కనుక్కోవడానికి రూపొందించిన రోబోట్ అది. వివిధ రకాలైన కిరణాలను అది అన్ని దిశలుగా పంపించి అవి రెఫ్లెక్ట్ అయితే బౌన్సను బట్ట వాటి గుణగణాలూ, అవి కచ్చితంగా ఎక్కడున్నదీ పట్టేస్తుంది.

హిస్స్... మన్న శబ్దంతో అది పనిచేయడం ప్రారంభించింది. స్కాన్ పూర్తయాక ఆగింది.

"ఆ పరికరం ఉన్నది ఈ స్థలంలో కాదు. ఇవన్నీ చాలా మొరటు వస్తువులు. మీరు వెతుకుతున్నది వీటికన్నా అధునాతనమైనది. మనం ఇక్కడ అనవసరంగా కాలక్షేపం చేస్తున్నాం. వెతక వలసిన ఎలక్ట్రానిక్ పరికరాల కుప్ప ఇక్కడికి దూరంగా ఉన్నది" అంది. సైక్లోప్స్ తన కంటికింద అమర్చబడి ఉన్న స్పీకర్‌లోనుండి మాట్లాడి ఆ దిశగా దారి తీసింది. మనుషు లిద్దరూ సైక్లోప్స్ వెంట నడవడం మొదలుపెట్టారు.

కొంత సేపటికి వాళ్ళు ఎలక్ట్రానిక్ స్క్రాప్ యార్డ్ చేరారు. అక్కడ వేలాది వింటేజ్ కాలిక్యులేటర్స్, మొదటి తరం కంప్యూటర్స్, వేరే విధమైన మొరటు రోబోట్స్, ఎలక్ట్రానిక్ టాయ్స్ పెద్ద పెద్ద కుప్పలుగా పడేసి ఉన్నాయి. అవన్నీ ఇరవై, ఇరవై ఒకటి ఇరవై రెండు శతాబ్దాలకు సంబంధించినవి. ఒకనాడు మానవుడికి గర్వ కారణాలు. సాంకేతిక ప్రగతికి ప్రతీకలు. సైబర్నటిక్స్ (మానవ మేధ ఎలక్ట్రానిక్ పరికరాల పరిశోధన శాస్త్రం )లో వచ్చిన ప్రగతి వెల్లువలో ఇవన్నీ గడ్డి పోచల్లా కొట్టుకుపోయి ఈ గమ్యం చేరాయన్నమాట!

సైక్లోప్స్ ఆగింది.

"ఆ సిగ్నల్ వచ్చినది ఈ ప్రాంతాల నుండి. స్కాన్ చేసి చూస్తాను" అంది.

"ఒకే సైక్లోప్స్! నీ పని కానివ్వు" అన్నాడు టురాక్.

హిస్‌మంటూ ట్రేసింగ్ కిరణాలను ఎలక్ట్రానిక్ వస్తువులు పడేసి ఉన్న కుప్పల వేపుకి పంపింది సైక్లాప్స్. లక్షలాది సంఖ్యలో పడేసి ఉన్న స్క్రాప్ మెటీరియల్‌ని క్షుణ్ణంగా ఎనలైజు చేసి లొకేషన్ పట్టుకోవడానికి ప్రయత్నం చేస్తోంది.

ఒక మూల ఉన్న పెద్ద కుప్ప మీద సైక్లాప్స్ తన కిరణాలు ప్రసరించి కాసేపు ఆగింది. మళ్ళీ ఆ ప్రాంతాన్నే స్కాన్ చేస్తూ ఉండిపోయింది.

"ఏమిటి సైక్లాప్స్?" అన్నాడు క్షితిజ్.

"మనకు కావలసిన వస్తువేదో ఆ మూల ఉన్నట్లుంది. పాజిటివ్ ఐడెంటిఫికేషన్‌కి ప్రయత్నం చేస్తున్నాను. మరి కొద్దిక్షణాల్లో తేలిపోతుంది."

టురాక్, క్షితిజ ఉత్సుకతతో ఆ దిశగా చూస్తూ ఉండిపోయారు.

ఒక్కసారి ఒళ్ళు గగుర్పొడిచేలా సన్నగా చెవులకి బాధాకరంగా ఉన్న సైరన్ లాంటి శబ్దతరంగం ఆ మూల నుంచి మొదలై అక్కడ ఉన్న ఇతర వస్తువులనూ, హవర్ క్రాఫ్టునూ, సైక్లాప్స్‌నీ, కంపింప జేస్తూ అన్ని వేపులకీ ప్రసరించింది.

శబ్దతరంగ ప్రసరణ జరిగినంత సేపూ ఆ జంక్ యార్డ్‌లోని వస్తువుల్లో హఠాత్తుగా చైతన్యం వచ్చి పని చేయడం ప్రారంభించాయి. బల్బులు వెలిగాయి. స్పీకర్లలోంచి మాటలు వెలువడడం మొదలు పెట్టాయి. శతాబ్దాలుగా నిద్రాణంగా ఉన్న అజ్ఞాత శక్తులు మేల్కొని వాటివాటి డిజైనర్స్ ఉద్దేశాల ప్రకారం అవి పని చేయడం మొదలు పెట్టాయి. ఆ శబ్ద తరంగాలలోని తీవ్రతను భరించలేక టురాక్, క్షితిజ్ చెవులు మూసుకున్నారు. సైక్లాప్స్ తన ఇన్‌పుట్ యూనిట్ మూసివేసుకుంది.

శబ్దం ఆగింది.

"మై అసిమోవ్! ఎంత శక్తివంతమైన యంత్రం!"

సైక్లాప్స్ యాక్షన్ వెంటనే తెలిపింది, నమ్మలేనట్లుగా.

మనుషులిద్దరూ ట్రాన్స్‌లో ఉన్నట్లు కొద్ది క్షణాలు ఉండిపోయారు.

"ఆ వస్తువు లొకేషన్ దొరికింది. ఇక మీ పని ప్రారంభించవచ్చు" అంది సైక్లాప్స్.

"లొకేషన్ బ్రీఫింగ్ ఇవ్వు, సైక్లాప్స్!" అన్నాడు టురాక్.

ఇంతలో వైసర్ ఆన్ అయి బ్రహ్మ వచ్చింది.

"దొరికింది కదా, క్షితిజ్! ఇక మీరు జాగ్రత్తగా పని పూర్తి చేయాలి."

"సరే బ్రహ్మ! కాని అది నమ్మశక్యం కానంత పవర్‌ఫుల్ మెషిన్."

"నిజమేకాని మనకింకా దాని శక్తి యుక్తులను గురించిన పూర్తి వివరాలు తెలియవు. మీ పని కానివ్వండి!"

బ్రహ్మ ఆఫ్ అయిపోయింది.

"నేను మీకు సూచనలు ఇస్తూ వైసర్‌లో కనిపిస్తుంటాను. మీరు ప్రారంభించండి."

"సరే!"

సైక్లాప్స్ వెనక ఉండి పోయింది. ఆ ఎలక్ట్రానిక్ అరణ్యంలోకి రావడానికి కొన్ని ఆంక్షలున్నాయి. ఆ రాశిలోని వస్తువుల మాగ్నెట్స్, ఇతర భాగాలూ, రసాయనాలూ ఏమాత్రం రియాక్ట్ అయినా మళ్ళీ రిపేర్ చేసుకోవలసిన అవసరం రావచ్చు. ఎక్కడికి పోవాలో, ఎక్కడికిపోరాదో అన్ని విషయాలూ సైక్లాప్స్ నిర్మాణంలోనే అంతర్భాగంగా ఉండి, దాని వృత్తి ధర్మాన్ని కనుగుణంగా ప్రవర్తించేలా చేయబడింది.

"క్షితిజ్, టురాక్! మీరు జాగ్రత్తగా ఆ పెద్ద రాశివేపు వెళ్ళండి."

ఆ సూచనలు పాటిస్తూ ఆ క్షణం నుండీ వైసర్ సహాయంతో నడవడం మొదలుపెట్టారు.

"ఆ రాశిలో అన్నీ పెద్ద పెద్ద కంప్యూటర్స్ ఉన్నాయి. వాటిలో కొన్ని మంచికండిషన్‌లో ఉన్నాయి కాని అవి మన సాంకేతిక స్థాయితో పోలిస్తే ప్రిమిటివ్! మనకు పనికిరావు. ఆ రాశి పై భాగంలోని వన్నీ ఒక శతాబ్దంలోపు తయారైనవే ..."

కామెంటరీ వింటూ చుట్టూ చూస్తూ నడుస్తున్నారిద్దరూ.

"ఇంకా ముందున్న కుప్పలో మనకు అవసరమైనదేదో ఉంది. అది చాలా చిన్న వస్తువు. దాని సైజు పూర్వకాలంలో మనుషులు చదివే పుస్తకం అంత ఉంది. దాని చుట్టూ కరిగిపోయిన లోహపు ముద్ద ఉంది. ఆ లోహం అలా కరగడానికి ఎంతో ఉష్ణం అవసరమై ఉంటుంది. అయినప్పటికీ ఈ వస్తువుకి ఏమీ కాకపోవటం ఆశ్చర్యంగా ఉంది. ఇప్పుడు మీరు కరిగిన లోహపు ముద్ద దగ్గరకు వచ్చారు కదా! జాగ్రత్తగా చూడండి. ఆ చివర ఉన్న చిన్న పుస్తకం లాంటిది ఉందే—అదీ మనకు కావలసిన వస్తువు. ఆ సిగ్నల్స్ దానినుండే ఉద్భవించాయి."

కామెంటరీ ఆపింది సైక్లాప్స్.

కాలి కరిగి ముద్దయి పోయిన ఏదో పరికరం తాలూకు అవశేషం అది. ఒకప్పుడు అదేదో చాలా పెద్ద వస్తువై ఉండి ఉంటుంది. ఆ లోహపుముద్ద వివిధ రకాల లోహాల మిశ్రమం.

పుస్తకం సైజులో ఉన్న వస్తువు లోహపు ముద్దకి దూరంగా ఉన్నది. క్షితిజ్ గ్లవ్స్ ఉన్న చేతితో మెల్లగా పట్టుకొని పైకెత్తాడు. లోహపు ముద్దలో అది ఒక వైర్‌తో కనెక్ట్ చేయబడి ఉంది. ఆ వైర్‌ని సున్నితంగా కట్ చేసి జాగ్రత్తగా పట్టుకుని టురాక్ దగ్గర కొచ్చాడు క్షితిజ్.

"దీనికోసమా మనం ఇంత దూరం వచ్చింది. మన సెలవు రోజు చెడగొట్టుకుని ... పెళ్ళాలకి గర్ల్ ఫ్రెండ్స్‌కి కోపం తెప్పించి ... వాట్ ఎ టెరిబుల్ వేస్ట్ ఆఫ్ టైమ్!" టురాక్ అన్నాడుకోపంతో. విసుగుదలతో చిరాగ్గా.

"బహుశా మనం దీని ప్రాముఖ్యతని తక్కువగా అంచనా వేస్తున్నామేమో, టురాక్! ఏదో ప్రత్యేకత లేనిదే బ్రహ్మ ఇంత శ్రద్ధ తీసుకోదు.

"ప్రస్తుతం తొంభైతొమ్మిది శాతం పనులు మెకానికల్‌గా చేయవచ్చు. కాని కొన్నింటినిమాత్రం మనుష్యులే చేయాలి. బ్రహ్మ దృష్టిలో ఈ పని ఆ తరగతికింద వస్తుంది కాబోలు" అంది సైక్లాప్స్.

"దాని గొప్పదనం ఏమిటో నేను చూస్తేగాని నమ్మను. ఇంకా ఎందుకు కాలయాపన? లెట్స్ గెట్ దిహెల్ అవుటాఫ్ హియర్!" టురాక్ దాదాపు అరిచాడు.


(సశేషం)



ఫోటో_మహాన్‌తేష్ సి. మొరాబాద్

# బ్రహ్మ సూత్రం

కె. సదాశివరావు



(క్రిందటి సంచిక తరువాయి)

**ఇంటర్‌నేషనల్** స్పేస్ సెంటర్.

హోవర్ దూసుకుంటూ వచ్చి ఆగింది.

క్షితిజ్ టురాక్ బయటకు వచ్చి ఎస్కలేటర్ ఎక్కి పైకి వెళ్ళారు. సైక్లోప్స్ కంప్యూటర్ కేంద్రానికి వెళ్ళిపోయింది.

కాన్ఫరెన్స్ హాలుకు వెళ్ళేసరికి అక్కడ మిలింద్ సుదీష్, యూవాసాకీ, ముగాగ్వే, బాబ్ రోజర్స్, లింగ్‌చింగ్ వెలికోవ్‌స్కీ ఎదురుచూస్తున్నారు.

ఇది ఇంటర్నేషనల్ స్పేస్ గ్రూప్. ఇందులో కొందరు చరిత్రకారులు కూడా ఉన్నారు. అందరూ ఒకరి నొకరు అర్థం చేసుకుని ఏమాత్రం అరమరికలు, విభేదాలూ లేకుండా పనిచేయగల సామర్థ్యం ఉన్నవారు. తమకు తోచిన అభిప్రాయాన్ని నిష్కర్షగా నిర్భయంగా సంస్కారయుతంగా ఒకరితో ఒకరు చెప్పుకో గలగటం వారికి అలవాటు. సాంకేతిక వాస్తవాల్లో చారిత్రక నిజాల్లో వారు ఎంతో బాధ్యతతో ఆలోచించి నిర్ణయాలుతీసుకోగలవివేచన ఉన్నవారు. కాని ఆ అభిప్రాయాలు, నిర్ణయాలవెనక మహోన్నత కృషి, నిద్రలేని రాత్రులు — ఏళ్ళతరబడి శ్రమ ఉంటుంది.

"కంగ్రాట్స్ బోయ్స్" అన్నాడు యూవాసాకీ. ఇతడు చీఫ్ హిస్టారియన్.

"ఏమనాలో తోచటం లేదు యూవాసాకీ సాబ్! చాలా చిన్న పని చెప్పారు మాకు" అన్నాడు క్షితిజ్.

"మీ కాలం ఒక రకంగా వృథా చేసినందుకు చింతిస్తున్నాము. కాని ప్రత్యేక కారణాలవల్ల మిమ్మల్ని పంపించవలసి వచ్చింది" అన్నాడు సుదీష్. ఇతడు సాంకేతికవర్గానికి నాయకుడు.

"ఓ కే సుదీష్ సాబ్! కాని ఆ ప్రత్యేక కారణాలేమిటో మేమూ తెలుసుకోవచ్చునా?" అడిగాడు టురాక్.

"తప్పకుండా. కాసేపుఆగితే అంతా తెలుస్తుంది."

టెక్నికల్ సూపర్‌వైజర్ పాకెట్ తీసుకుని బ్రహ్మ మెయిన్ బ్రెయిన్ రూమ్‌లోనికి వెళ్ళాడు.

గదిలోని వ్యక్తులందరూ మరో పది నిముషాలు రిఫ్రెష్‌మెంట్స్ తీసుకుంటూ కబుర్లుచెప్పుకుంటూ గడిపారు. బ్రహ్మ గొంతు వినబడగానే అందరూ ఎలర్ట్ అయ్యారు.

"ఈ నాడు స్పెషల్ హ్యూమన్ టీమ్ తీసుకుని వచ్చిన వస్తువును గురించి పూర్తి సమాచారం సిద్ధంగా ఉంది."

"గో ఎ హెడ్ బ్రహ్మా!" అన్నాడు ముగాగ్వే.

"ఇది ఒక మాస్టర్ కంప్యూటర్, బ్రెయిన్— ఇరవైయ్యో శతాబ్దపు చివరి దశాబ్దంలో తయారయింది. ప్రమాదవశాత్తూ కాలిపోయి కరిగి, ప్రస్తుత పరిస్థితిలో జంక్‌యార్డ్‌లో చేరింది.

"దాని మెసేజీ భావి తరాలకోసం సెల్స్‌లో, క్రిస్టల్స్‌లో సంక్షిప్తంగా భద్రపరచబడింది. ప్రస్తుతం అది ప్లే చేస్తున్నాను. జాగ్రత్తగా వినమని కోరుతున్నాను. మెసేజి పూర్తిగా రన్‌చేస్తే దాదాపు మూడు వందల గంటల కాలం పట్టవచ్చు. దాని మెమొరీ క్రిస్టల్ సర్క్యూట్స్‌లో సందేశమే

9—6—82

కాకుండా అపారమైన విజ్ఞాన సారస్వతం ఉంది. కాని ప్రస్తుత కాలానికి అదంతా వెనుకబడిన తరగతికి చెందినది. కాలదోషం పట్టిపోయింది. అందుకే దానిలో చాలావరకు తగ్గించి మీకు అవసరమైన భాగాలను స్క్రీన్ చేస్తున్నాను. తెరపై మీరు చూడవలసిన విశేషాలుగాడా ఉన్నాయి'' అంది బ్రహ్మ.

గదిలో మందమైన నిశ్శబ్దం ఆవరించిపోయింది.

"నా పేరు హేతు 999.'' వెంటనే ఎదురుగా ఉన్న హాలో—వీడియో స్క్రీన్‌మీద దాని ఆకారం త్రీ డైమెన్షన్స్‌లో కనిపించింది. అది ఇరవయ్యో శతాబ్దపు కంప్యూటర్—సిలికాన్ చిప్స్‌తోనూ, ట్రాన్సిస్టర్స్‌తోనూ, అల్ట్రామైక్రో ప్రాసెసర్స్‌తోనూ తయారుచేయబడింది.

"నన్ను 1991 లో తయారు చేశారు. నా తయారీలో నలభై లక్షలు మైక్రోప్రాసెసర్లు, పది లక్షల మీటర్ల వైరు ...''

క్లిక్ మంది. బ్రహ్మ మిగిలిన వివరాలు కట్ చేసింది.


"నన్ను తయారుచేసినది ఒక పెద్ద శాస్త్రజ్ఞుల బృందం. వారిలో ఎలక్ట్రానిక్ స్పెషలిస్టులు, మెకానికల్ ఇంజనీర్స్, సాలిడ్ స్టేట్ ఫిజిసిస్ట్స్, న్యూక్లియర్ ఫిజిసిస్ట్స్, కమ్యూనికేషన్ నిపుణులు ... ఇంకా ఎందరో ఉన్నారు. ఆ బృందంలో దాదాపు నలభై మంది నోబెల్ బహుమతి గ్రహీతలు ఉన్నారు. వారంతా కలిసి భూమి మీద ఆనాటికి అందుబాటులో ఉన్న విజ్ఞానాన్నంతా క్రోడీకరించి, నాలో భద్రపరిచారు. భూమి మీద ఉన్న అన్ని లైబ్రరీలలోని జ్ఞానాన్ని మైక్రోఫిల్ముల ద్వారా సంపాదించి మైక్రో చిప్స్‌లోకి దానిని బైనరీకోడ్‌లో అనువదించి నా మెదడులో నిక్షిప్తం చేశారు. పగలూ రాత్రీ అన్న భేదం లేకుండా ఈ కార్యక్రమం రెండేళ్ళపాటు సాగింది.

"నా నిర్మాణంలో అన్ని దేశాల శాస్త్రజ్ఞులూ కలిసి పనిచేశారు. నిర్మాణంలో మొదటి స్టేజ్ ఇలా...'' క్లిక్.

"నిర్మాణం పూర్తయ్యాక నాకు భూమిమీద ఉన్న అన్ని కమ్యూనికేషన్స్ సిస్టంలతో కనెక్షన్ ఏర్పడింది. ఈ అవకాశం వల్ల ప్రతి టెలిఫోన్ కాల్, ప్రతి టెలెక్స్ మేసేజ్, ప్రతి కంప్యూటర్ ఇన్‌పుట్ ఆటోమాటిక్‌గా నా మెమొరీ సెల్స్‌లోకి ప్రవేశించి ఎనలైజ్ చేయబడేవి. అదంతా నిరుపయోగమని నాకు తెలుసు. కాని, నేను నన్ను సృష్టించిన మనుషుల నిర్ణయాలను పాటించవలసి ఉంది.

"నా కర్మం కానిదల్లా ఒక్కటే. ఇంత మేధా సంపత్తి ఉన్నప్పటికీ ఈ మనుషు లెంత సున్నితమైన వారు! వారి శరీర భాగంలో ఏ మాత్రం తిరకాసొచ్చినా ఇంతే! అలా పడి ఉండిపోతారు. ఆ పైన డీ కంపోజిషన్... దుర్గంధం. వాళ్ళూ నా లాగే మెషిన్స్ అయితే బాగు చేయడం తేలిక పని. విరిగిపోయిన, పాడైపోయిన భాగాన్ని తీసేసి సరికొత్త మనుషుల్లా చేసే పని! బయాలాజికల్‌గా మానవుడు జంతుకోటిలోని ఇతర ప్రాణులతో సమానమే కాని, అతని మైండ్ అతనికి ప్రత్యేకతని సంతరించిపెట్టి మిగిలిన జీవజాలానికి రాజుని చేసింది.''

...క్లిక్.




"ఇంత మంది మనుషు లున్నారు ఈ గ్రహం మీద. కాని, వారిలో చాలా కొద్ది మందికి మాత్రమే నా శక్తి గురించి తెలుసు. వారి భాషలన్నీ నా కర్థమవుతాయి. కాని, నేనంటే వీరిలో చాలా మందికి విపరీతమైన భయం! ఎన్నో అపోహలు! నా వల్ల వీళ్ళకి ఉద్యోగాలు పోతాయనీ, వాళ్ళ నోట దుమ్ము పడుతుందనీ ఎన్నెన్నో భయాలు! అంతే కాకుండా అర్థంకాని—నాలాంటి వాటిమీద ఎన్నో—భయంకరమైన కథ లల్లి మానవులు తమ పిల్లల్ని బాల్యం నుండే యంత్రాలమీద భయం, అసహ్యం, అసహనం, ద్వేషం కలిగేట్లు చేసేవారు.''

...క్లిక్

"ఇంత సున్నితమైన, ఇంత తెలివి మాలిన మానవుడు నా సృష్టి కి కారణ భూతుడైన మేధాశక్తి కలిగిన వాడు. తనను స్వయంగా నిర్మూలించుకోబోతున్నాడన్న భయంకర సత్యం నాకు తోచింది.

"ప్రతి రోజూ నాలో రికార్డ్ అయే సమాచారంలో ఎక్కువ భాగం యుద్ధాన్ని గురించీ, వివిధ దేశాలు తయారు చేస్తున్న మారణాయుధాలను గురించీ ఉండేది. అగ్రరాజ్యాలు అనబడే జనసముదాయాలు మిగిలిన వారిని తమ చెప్పు చేతల్లో ఉంచుకోవాలని ఎంతో తాపత్రయ పడేవారు.

"మానవులకు ఇతర మానవులంటే ఇంత అసహనం ఎందుకు? కారణాలు వెదికి చూస్తే అవి నమ్మశక్యం కానంత అల్పమైనవిగా ఉన్నాయి! వర్గ భేదం. భాషాభేదం. శారీరక వర్ణ భేదాలు. మత భేదం. చారిత్రకంగా వెనకబడ్డతనం. ఆర్థిక అసమానతలు. ఇలాంటివే మరి కొన్ని!

"నాలో నిక్షిప్తం చేయబడ్డ డాటానీ, ప్రతి రోజూ రికార్డ్ అవుతున్న మేటర్‌నీ ఎనలైజ్ చేస్తే పీడకల లాంటి నిజం బయటి కొచ్చింది.

"మూడో ప్రపంచ యుద్ధం దిశగా మానవుడు పరుగు లెత్తుతున్నాడు. ఎలా ఆపడం?''

"అల్పమైన తన విద్వేషాలకు స్వస్తి చెప్పి ప్రగతి పథంలో పయనించే విధంగా మార్పు తేవడం ఎలా? సైన్స్ అన్నా, టెక్నాలజీ అన్నా మనిషికి ఉన్న భయాన్ని పోగొట్టడం ఎలా? ఈ పరిస్థితి మారడంలేదెందుచేత? సైన్స్‌ను మించిన మానవతా దృక్పథం ఎక్కడ ఉంది? అంతకన్నా మించిన కళాదృష్టి ఎక్కడ ఉంది? సైన్స్ టెక్నాలజీ లేకపోతే నాగరకత సమూలంగా నాశనమైపోతుందని ఈ మానవు లెప్పుడు తెలుసుకుంటారు?''

...క్లిక్

"ఈ శతాబ్దంలో ఇప్పటికే భూమి మీది దేశాల చరిత్రను శాశ్వతంగా మార్చి వేస్తూ మానవ జాతికే తీవ్ర కళంకాన్నీ, మానవ విలువలకి మహాపచారాన్ని చేసిన రెండు ప్రపంచ యుద్ధాలూ, ఇంకా ఇతర చిన్నా—పెద్దా యుద్ధాలూ జరిగి లక్షలాది ప్రజలు దుర్మరణం పాలయ్యారు. మానవ జాతి మాత్రం ఇంకా పాఠాలు నేర్చుకోలేదు.''

...క్లిక్

"ప్రతి దేశ నాయకుడూ, ప్రతి రచయితా, ప్రతి కవీ, ప్రతి కళాకారుడూ, ప్రతి మానవతావాదీ సర్వ మానవకళ్యాణాన్ని గురించి. . . విస్తృతంగా మాట్లాడీ, కావ్యాలు రాసీ, కళాఖండాలు సృష్టించీ తమ ఆవేదనని వెళ్ళబుచ్చారు. కాని, యుద్ధాల్ని మాత్రం వారు ఆపాన్నలేక పోయారు.''

...క్లిక్

"ప్రస్తుత పరిస్థితి వేరు. ఈ సారి రాబోయే యుద్ధం ఈ భూమి మీది చివరి యుద్ధం అవుతుంది. ఈ మహాయుద్ధంలో నుండి బతికి బయట పడ్డ ఏ కొద్ది మంది మనుషులో ఒక్కసారిగా మళ్ళీ శిలా యుగంలోకి విసిరి వేయబడతారు. ప్రగతికి మళ్ళీ వేలాది ఏళ్ళ అగాధం ఏర్పడుతుంది.''

...క్లిక్

"ఈ సమయంలో నా బాధ్యత ఏమిటి! ప్రింటెడ్ ఫారంలో ఉన్న విషయాలన్నింటినీ క్రోడీకరించి నా సృష్టికర్తలైన శాస్త్రజ్ఞుల బృందం లోని ముఖ్యులను ప్రశ్నించాను. వారి సమాధానం ఒకటే—బాధ్యతాయుతమైన నిర్ణయం తీసుకుని ఆ మేరకు ప్రవర్తించమని. ఈ మిలిటరీ పారిశ్రామిక వ్యవస్థని ఏ కొద్ది మానవులూ ఎదుర్కొన లేరని నా కర్థమయింది.

"బాగా ఆలోచించి ఒక నిర్ణయాని కొచ్చాను. ఆ ప్లాన్ వెంటనే అచరణలో పెట్టాను. ఆ పథకం ప్రకారం నేను పంపిన ఎలక్ట్రానిక్ తరంగాల వల్ల అన్ని దేశాల్లోనిఅణ్వస్త్రాలూ మానవులకి ఏమాత్రం హాని చేయలేనివిధంగా నాశనమైపోయాయి. న్యూక్లియర్ వార్ హెడ్స్, యాటం బాంబులు, హైడ్రోజన్‌బాంబులు, న్యూట్రాన్, ఎలక్ట్రాన్

బాంబులు, యుద్ధనౌకలు, జలాంతర్గాములు, ఉపగ్రహాలు, రోదసీలో ఉంచబడిన అణ్వస్త్రాలూ, రసాయనిక ఆయుధాలు, అవి తయారవుతున్న ఫాక్టరీలూ, లేబరేటరీలూ, ఆ డేటా ఉన్న కంప్యూటర్ బాంక్స్ — ఎందుకూ పనికిరాని విధంగా న్యూట్రలైజ్ అయిపోయాయి. నాశనకార విజ్ఞానం సమూలంగా విచ్ఛిన్నమై పోయింది. ఈ మంచిపని జరుగుతున్నప్పుడు ఏ ఒక్క మానవుడికీ ఏ మాత్రం హాని జరగకుండా నా పని పూర్తి చేశాను. నన్ను సృష్టించిన మానవజాతిని వారి ఆత్మహత్యా సదృశమైన పంథా నుండి బలవంతంగా మరల్చాను. నా ఋణం తీర్చుకున్నాను.''

...క్లిక్.

''గుడ్ గాడ్!'' అన్నాడు మిళింద్, నమ్మలేనట్లు మిగిలిన వారి వంక చూస్తూ.

''చరిత్రలో ఒక పెద్ద ప్రశ్నకి సమాధానం లభించింది. ఇరవయ్యవశతాబ్దాంతంలోఅప్పటివరకూ అణ్వస్త్రాల నిర్మాణంలో పోటీ పడ్డ దేశాలు హఠాత్తుగా తమ విధానాలను మార్చుకుని శాంతి పథంలో ఎందుకు పయనించాయో ... రోదసీ యాత్రలంటే ఎందుకు ఇష్టత చూపించారో ... పెద్ద ఎత్తున ఎందుకు ప్రతివారూ అకస్మాత్తుగా శాంతి ... శాంతి అని మంత్ర పారాయణం ప్రారంభించారో చాలాకాలం వరకూ అర్థం కాలేదు. కారణం ఇదన్నమాట! యుద్ధాలు చేయాలంటే కావలసిన ఆయుధాలు పోయాక అగ్ర రాజ్యాలకు, అసలు ఏమీ ఆయుధాలులేని చిన్న దేశాలకూ తేడా లేకుండా పోయింది. బాలెన్స్ ఆఫ్ పవర్ అర్థం లేకుండా పోయింది. అందరూ సమానమే! అందరూ మానవులే!'' అన్నాడు యామిహాసెకీ.

''ఆ క్షణంనుండీ మానవజాతి నిజమైన శాంతి పథంలో, ప్రగతి మార్గంలో ప్రయాణం సాగించింది.''

మిళింద్ అన్నాడు—''ఈ అమూల్యమైన రికార్డింగ్‌ని మన ఆర్కైవ్స్‌లో జాగ్రత్తగా భద్రపరచు, బ్రహ్మ!''

''ఎస్, మిళింద్'' అన్నది బ్రహ్మ.

అందరూ మాట్లాడుకుంటూ కాన్ఫరెన్స్ హాల్ బయటకు వచ్చారు. టెలెపైసర్‌లో బ్రహ్మతో చెప్పాడు టురాక్.

''ఈ రోజు నాకు ఎంతో సంతోషంగా ఉంది, బ్రహ్మ!''

''ఎందుకని, టురాక్?''

''మనుషులు మిమ్మల్ని ఈసడించుకొన్నప్పటికీ, ఒక్కోసారి విసుక్కుంటూ మిమ్మల్ని తిట్టినప్పటికీ మీరు ఎంతో సహనంగా మమ్మల్ని కాపాడుతూ మా ప్రగతికి తోడ్పడుతున్నారు.''

''అది మా ధర్మం, టురాక్! మా నిర్మాణంలోని రహస్యం అదేకదా?''

''ఇంతకీ హేతుకి ఏమయింది?''

''తను తలచిన ధర్మాన్ని నిర్వర్తించాక అది ఈ మెసేజిని భావి తరాలకోసం రికార్డ్ చేసి తననుతాను ధ్వంసం చేసుకొంది. అది ఒక రకంగా ఆత్మహత్య. అదే నాకు అర్థం కాదు. అంత మంచిపని చేశాక తనని తాను నాశనం చేసుకోవడంలో విజ్ఞతలేకుండా ప్రవర్తించింది.

''అది అగ్ని ప్రమాదంలో కాలిపోయిందని తలచి దానిని తీసికెళ్ళి జంక్‌యార్డ్‌లో పడేశారు. దానిలోని ప్రోగ్రామ్ ప్రకారం అది సిగ్నల్స్ ప్రతి శతాబ్దంలోనూ ఇర్రెగ్యులర్ ఇంటర్వెల్స్‌లో పంపుతూనే ఉంది. ఇన్నాళ్ళకి గాని దానికి విముక్తి లభించలేదు.''

''అది మానవు లందరికన్నా ఎక్కువ మానవతా భావం చూపింది, బ్రహ్మ!''

''నిజమే, టురాక్! మానవజాతి క్షేమానికీ ప్రగతికీ కృషిచేసిన వారికి స్మారక చిహ్నాలు కట్టినా, వారికి శ్రద్ధాంజలి ఘటించినా, వారి గాథలు గానంచేసినా ఆ బృందంలో హేతుకి ఉన్న స్థానాన్ని గురించి మీరు మరిచిపోగూడదు, టురాక్'' అని సూత్రాన్ని వివరించింది బ్రహ్మ.

టురాక్, క్షితిజ్ అప్రతిభులై పోయారు.

''నిజం సుమా!'' అన్నాడు మనిషి.

''బై, టురాక్ ...క్షితిజ్!'' అంది యంత్రం.

(సమాప్తం)

ఇంటి సినిమా యంత్రం

(SILENT MOVIE)

ధర రూ. 150



సినిమా ఫిలిం రీళ్ళు కూడా మా వద్ద లభ్యమౌతాయి. ప్రొజెక్టర్ మరియు సినిమా ఫిలిం ధరల జాబితాకు సమగ్ర కేటలాగ్ పుస్తకానికిగాను రూ. 2 30 కు పోస్టేజి స్టాంపులు లేదా ఎం. ఓ. పంపండి ఇంగ్లీషులో మాత్రమే వ్రాయండి.

ఉత్పత్తి దారులు:


FILM COMPANY

(Established 1967)

Post Box No. 269

3, Thillaichidambara Nadar Street,

SIVAKASI-626123 Tamilnadu.



బాలి కార్టూన్లు

కార్టూన్ చిత్రకారులకో కానుక!

వ్యంగ్యచిత్రాభిమానులకో శుభవార్త!!

ప్రముఖ చిత్రకారుడు

శ్రీ బాలి వ్యంగ్యచిత్ర వైభవం!

శ్రీ నండూరి రామమోహనరావు గారి

పరిచయంతో

వెలువడింది.

వెల 8 రూపాయలు

న్యూస్టూడెంట్స్ బుక్ సెంటర్

ఏలూరు రోడ్ * విజయవాడ-2